www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 ఏప్రిల్ 2024




పోలీసుల కవాతు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్పీ పి.జాషువ ఆదేశాల మేరకు చిత్తూరు రెండవ పట్టణ పోలీస్ పరిధిలో ప్రశాంత్ నగర్‌లోని అన్ని ప్రాంతాల్లో 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఉలసయ్య సోమవారం కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. 2వ పట్టణ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా పరిధిలోని ప్రాంతాలు, ముఖ్యమైన కాలనీలలో ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ప్రజలకు ఎలక్షన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



తీర్పులో.. నారీమణులు





- ఈ ఎన్నికల్లో మహిళలు కీలకం...
- జీడి నెల్లూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ

గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ పునర్విభజన తరువాత అసెంబ్లీ స్థానాన్ని ఎస్సీ రిజర్వుడ్‌కు కేటాయించారు. ప్రస్తుతం ఎక్కడ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈనియోజకవర్గం పరిధిలో వెదురుకుప్పం, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం (ఎస్ఆర్ పురం) పాలసముద్రం, గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాలు ఉన్నాయి.. 35 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 17వ తేదీ ఓటర్ల జాబితా ప్రకారం 2,04,669 మంది ఓటర్లలో ఉన్నారు. వీరిలో పురుషులు 01,697 ఉండగా, మహిళలు 02,966 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో మహిళా ఓటర్లు 1269 మంది ఉన్నారు. కాగా సర్వీస్ ఓటర్లు 475 మంది, పిడబ్ల్యూడి ఓటర్లు 3583 మంది, 18 సంవత్సరాలు నుండి 19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 4641 మంది, సీనియర్ సిటిజన్లు 2763 మంది ఉన్నారు.

ప్రజాశక్తి- వెదురుకుప్పం

తొలిసారిగా ఓటు హక్కు...

నియోజకవర్గంలో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుని యువత 4,641 మంది ఉన్నారు. వీరంతా 18 నుండి 19 సంవత్సరాల మధ్య ఉన్నవారు. కొత్తగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పోలింగ్ కేంద్రాలు, మండలాల వారీగా, ఓటర్ల వివరాలు..

పెనుమూరు మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్లు 32,500 మంది. వీరిలో పురుషులు 16,176 మంది. మహిళలు 16,323 మంది. ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారు. ఈ మండలంలో 147 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

వెదురుకుప్పం మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు, మహిళలు 17,996 మంది, పురుషులు 18,132 మంది ఓటర్లు ఉన్నారు, ట్రాన్స్‌జెండర్స్ ముగ్గురు ఉన్నారు.136 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.


కార్వేటినగరం మండలంలో 50 పోలింగ్ కేంద్రాలు, 17,250 మంది పురుష ఓటర్లు, 17,834 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 584 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

శ్రీరంగరాజపురం (ఎస్ఆర్ పురం) మండలంలో 35 పోలింగ్ కేంద్రాలు, 14,477 మంది పురుష ఓటర్లు, 14, 763 మంది మహిళా ఓటర్లు ఒక ట్రెండ్ జెండర్ ఓటు ఉంది. ఇక్కడా 256 మంది మహిళలో అధికంగా ఉన్నారు.

గంగాధర నెల్లూరు మండలంలో 64 పోలింగ్ కేంద్రాలు, 26,861 మంది పురుషులు, 27,029 మంది మహిళలు ఉన్నారు. ఒక ట్రాన్స్ జెండర్ ఓటు ఉంది. 168 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

పాలసముద్రం మండలంలో 23 పోలింగ్ కేంద్రాలు, 8,801 మంది పురుషులు. 9021 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ మండలంలో 220 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఒక్క వెదురుకుప్పం మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ మహిళలు అధికంగా ఉన్నారు. దీంతో ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో మహిళలు ఎవరికి ఓట్లు వేస్తే వారికే అధికారం దక్కనుంది. ఈ ఎన్నికల్లో ప్రధాన న్యాయనిర్ణేతలు వీరే కానున్నారు. దీంతో రాజకీయ పార్టీల నాయకులు మహిళా ఓటర్లను మెప్పించడానికి నానాపాట్లు పడుతున్నారు.



రికార్డులు బ్రేక్...

- 2023-24కు రూ.18.57 కోట్లు వసూలు
- కమిషనర్ హయాంలో గణనీయంగా పెరిగిన పన్నుల వసూళ్లు



పన్నుల వసూళ్లలో నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పన్నుల వసూళ్లలో చిత్తూరు నగరపాలక సంస్థ వరుసగా రెండో ఏడాది రికార్డు స్థాయిలో దూసుకుపోయింది. గత రికార్డులను తిరగరాస్తూ గరిష్ట స్థాయిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లు సాధించింది. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్లిన రెవెన్యూ యంత్రాంగం రికార్డుస్థాయిలో పన్నుల వసూలు సాధించింది. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2024, మార్చి 31వ తేదీ నాటికి గరిష్ట స్థాయిలో 18.57కోట్ల మేర పన్నులు వసూలు చేశారు. గత ఏడాది (2022-23) ఇదే సమయానికి మొత్తం డిమాండ్లో 79 శాతం పన్నులు వసూలు సాధించగా.. 2023-24లో 80 శాతం సాధించడం విశేషం. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుత చేసిన పన్నుల వసూళ్లు దాదాపుగా రెట్టింపు.

చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో పన్నుల వసూలు కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా సాగింది. ముందస్తుగా నిర్దేశించుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో పన్నులు వసూళ్లు చేపట్టారు. ప్రధానంగా దీర్ఘకాలికంగా, పెద్దమొత్తంలో ఉన్న బకాయిలపై ప్రత్యేకదృష్టి సారించారు. అధికారులు నిత్యం పన్ను చెల్లింపుదారులను కలిసేలా చర్యలు తీసుకున్నారు. గత ఎడాది ఇదే తరహా ప్రణాళికతో పాత బకాయిలను విజయవంతంగా వసూలు చేశారు. దీంతో 2023-24 సంవత్సరానికి డిమాండ్ గణనీయంగా తగ్గింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.35 కోట్లు డిమాండ్ ఉండగా.. కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తిరిగి రూ.27.72 కోట్లు వసూలు చేశారు. ఇందులో పాత, మొండి బకాయిలే ఎక్కువ. ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ గణనీయంగా తగ్గి రూ.23.21 కోట్లకు చేరింది. ఈ సంవత్సరం కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో రెవెన్యూ యంత్రాంగం గడిచిన మూడు నెలల నుండి క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించడంతో మార్చి నెలలో పన్నులు వసూళ్ల వేగాన్ని మరింత వేగవంతం చేశారు. ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.18.57 కోట్లు పన్నుల వసూలు చేపట్టారు. ఆఖరి రోజైన ఆదివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.1.53కోట్లు పన్నులు వసూలైంది.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకున్నారు..

ఆస్తి, ఖాళీ స్థలంకు సంబంధించి పన్నులపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయడంతో మెజారిటీ పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వడ్డీ మాఫీ ప్రకటన వెలువడిన మార్చి నెలలో రూ.5.44 కోట్లు పన్నులు వసూళ్ళు కాగా ఇందులో సుమారు మూడు కోట్లు పాత బకాయిలే కావడం గమనార్హం. నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు కమిషనర్ అరుణ కృతజ్ఞతలు తెలిపారు. పన్నుల వసూళ్లకు కృషిచేసిన రెవెన్యూ అధికారులు, వార్డు కార్యదర్శులను అభినందించారు.

గేటు వసూళ్లు రద్దు చేయాలి : సిఐటియు



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి మున్సిపాలిటీలోని ఆటో వర్కర్స్‌కు గేటు వసూలును రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ మున్సిపాలిటి కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని ఏ మున్సిపాలిటీల్లోనూ కార్పొరేషన్లోనూ గానీ గేటు వసూలు చేయడం లేదని, నగరిలో మాత్రం గేటు వసూలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో వర్కర్స్ డిగ్రీలు చదువుకొని ఉద్యోగం లేక కుటుంబ పోషణకు ఆటో నడుపుతున్నారని, ఓ పక్క పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోతుంటే మరోవైపు ఆర్టీవో, పోలీసులు జరిమానాలు పేరుతో వసూళ్లు చేయడంతోపాటు మున్సిపాలిటీ వారు గేటు వసూల్ చేయడం వల్ల ఆటోడ్రైవర్ల జీవనం సాగడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పది రూపాయలు ఉంటే 2024 టెండర్లు ఆటోకి 20 రూపాయలు పెంచడం సరైన పద్ధతి కాదన్నారు. పది రూపాయలే కట్టలేక ఇబ్బంది పడుతుంటే అదనంగా రుసుము పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి టెండర్లను రద్దు చేయాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పవర్లూమ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెరుమాళ్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, జైభీం సేన ఆటో వర్కర్స్ నాయకులు కే.వెంకటేష్, దేవరాజులు, రాజేష్,మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు: కలెక్టర్



తాగునీటి సమస్యపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లు, సామాజిక పెన్షన్ల పంపిణీ, వేసవిలో తాగునీటి సరఫరాపై జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్వోలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు, ర్యాంప్‌లను పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే మౌలిక వసతుల ఏర్పాట్లను మరొకసారి సరిచూసుకోవాలని తెలిపారు. తహసిల్దార్లు, ఎంపీడీవోలు వారంలోపు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సంబంధిత రిటర్నింగ్ అధికారికి నివేదికలు సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రం సంఖ్యను సూచించే విధంగా ఎన్నికల కమిషన్ సూచించిన మేరకు రంగులు ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ సమయంలో సామాజిక పెన్షన్ల పంపిణీ గ్రామ/వార్డు సచివాలయాలలో సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయాలని, పెన్షన్ల పంపిణీకి వాలంటీర్లను వినియోగించరాదని తెలిపారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి నగదును బ్యాంక్ నుంచి తీసుకురావడం, లబ్ధిదారులకు పంపిణీకి తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ద్వారా వాలంటీర్లకు పంపిణీ చేయబడ్డ సిమ్ కార్డులు, ఐరిష్ లేదా బయోమెట్రిక్ డివైస్, సెల్ ఫోన్‌లను ఎంపీడీఓ లు స్వాధీనపరచుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కి అందజేయాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో నీటి ఎద్దడి ఉందని, ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఎంపీడీఓలు, తహశీల్దార్లు ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలలో అవసమైతే ప్రైవేట్ బోర్లను వినియోగించుకోవాలని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రిటర్నింగ్ అధికారి అనుమతితో ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ట్యాంకర్లను అనుమతించాలని అన్నారు. జిల్లాలో ప్రధానంగా పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాలలో నీటిఎద్దడి ఉందని ఎక్కడైనా అటువంటి సమస్యను గుర్తించి తహశీల్దార్లు, ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు నుంచి డిఆర్డిఎ పిడి తులసి, డ్వామా పిడి రాజశేఖర్, డిపిఓ లక్ష్మి, మెప్మా పీడి రాధమ్మ, డిఎల్‌డిఓలు రవికుమార్, గౌరి, ఎస్ఈ ఏపీట్రాన్స్కో శ్రీహరి పాల్గొన్నారు.

'తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు'

వేసవి దృష్ట్యా నగరంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలోని 50 వార్డుల్లో 39 వార్డులకు కల్వకుంట జలాశయం నుంచి నీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జలాశయంలో ప్రస్తుతం 2,100 ఎంఎల్డీల నీరు ఉందని.. మరో మూడు నెలల వరకు నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదని తెలిపారు. మిగిలిన 11 వార్డులో బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అదనంగా ట్రిప్పుల్లో నీటి సరఫరా చేస్తామన్నారు. నగరంలో మొత్తం 463 బోర్లకు గాను 457 బోర్లు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయని, మరో ఏడు బోర్లు మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. తాగునీటి సమస్యపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తాగునీటి సమస్య ఉత్పన్నమైతే 9849907885కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ చెప్పారు.

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్స్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపు, వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచడం జరుగుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకొనెలలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్‌తో పాటుగా బిఎల్ఓ, విఆర్ఏను వారికి సహాయకులుగా అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు వారి సమీపాన ఉన్న పోలింగ్ కేంద్రం లొకేషన్, బిఎల్ఓ లేదా విఆర్ఏ ఫోన్ నెంబర్ వారికి తెలియజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో వీడియో కవరేజ్, వెబ్ క్యాసిటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏయే పోలింగ్ కేంద్రాలకు ఏ నెట్ వర్క్ వస్తుందన్న వివరాలను నెట్‌వర్క్ టవర్లు కు సంబంధించి విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వై.శ్రీనివాస్, డిటి సిఎంజి నిరంజన్ రెడ్డి, ఆర్‌టిఓ సునీల్ కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ నరసింహులు, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

ఎంసీసీ ఫిర్యాదులపై తక్షణం చర్యలు : ఏఆర్వో, కమిషనర్ డా. జె అరుణ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఏఆర్వో కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఆర్వో ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్ సౌకర్యాలు కల్పించామని, విద్యుదీకరణ, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నిచర్ వంటి సౌకర్యాలు పూర్తి చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సదరు పోలింగ్ కేంద్రం సంబంధించి పోలింగ్ స్టేషన్ నెంబర్, జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, బూత్ లెవెల్ ఆఫీసర్ వారి ఫోన్ నెంబర్లు రాయించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద శుభ్రత పనులు చేపట్టినట్లు వివరించారు. నగరపాలక పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్లు ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ వివరించారు. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల భవనాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాజకీయపరమైన బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులు, విద్యుత్ స్తంభాలు, గోడలకు ఏర్పాటు చేసిన స్టిక్కర్లను తొలగించామన్నారు. ఎంసీసీ అమలుకు సంబంధించి అందిన ఫిర్యాదులపై సత్వరం చర్యలు తీసుకుంటున్నామని, సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు అందిన 26 ఫిర్యాదులను ఎంసీసీ బృందాలు పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నగరంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగర ప్రజల సైతం ఏమి చేయాలో, ఏమి చేయకూడదో అవగాహన పెంచుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీసీ అధికారులు గోపి, గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

ఆందోళన వద్దు.. అన్ని ఏర్పాట్లు చేసాం : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కోసం ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ వారి మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పింఛను లబ్దిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర కమిషనర్ అరుణ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీ నుండి సంబంధిత వార్డు సచివాలయాల్లో వార్డు కార్యదర్శుల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. క్లస్టర్ వారీగా లబ్ధిదారులకు సమయాన్ని కేటాయించి సంబంధిత వార్డు కార్యదర్శుల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పింఛను లబ్దిదారులకు ఎలాంటి లోగోలు లేని పెన్షన్ కార్డుల ద్వారా పెన్షన్ మొత్తం అందిస్తామన్నారు. నగరపాలక పరిధిలో మొత్తం 16,697 పెన్షన్ల పంపిణీ సంబంధించి వార్డు సచివాలయం పరిధిలో క్లస్టర్ వారీగా కార్యదర్శులను కేటాయించడం జరిగిందన్నారు. పింఛను లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా నిర్దేశించిన సమయంలో సచివాలయానికి వచ్చి పింఛన్ పొందాలన్నారు. బెడ్ రీడన్ పేషెంట్లకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పింఛన్ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఎంఎం గోపి పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్లు ఆగితే చంద్రబాబు పాపమే: టిడిపి

ప్రతినెలా ఒకటో తేదీ అవ్వ తాతలు, వృద్ధులు వికలాంగులకు వలంటీర్ల ద్వారా అందించే పింఛన్లపై తెలుగుదేశం పార్టీ కుట్రలు చేయడం సరికాదని, వలంటీర్ల వ్యవస్థపై తెలుగుదేశం చేస్తున్న ఆరోపణలపై వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తారీకు నుండి 5వ తేదీ లోపుగా సామాజిక పింఛన్లు వాలంటీర్లు అందిస్తున్నారని తెలుగుదేశం తొత్తుగా వ్యవహరిస్తున్న కొందరు స్వార్ధపరుల ఫిర్యాదు మేరకు వలంటీర్లను పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అరాచకాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేవంలో నాయకులు జ్ఞాన జగదీష్, రాహుల్ రాజారెడ్డిలు పాల్గొనానరు.

పింఛన్లు సకాలంలో అందేటట్లు చూడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ఎన్నికల షెడ్యూలు నేపథ్యంలో వలంటీర్ల ద్వారా అందించే పింఛన్ల పంపిణీ నిలిపివేయడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సకాలంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులకు పింఛన్లు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. సోమవారం పలమనేరులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధికారులు ఇందుకు గ్రామ, వార్డు సచివాలయం, రెవెన్యూ ఉద్యోగుల సేవలను ఉపయోగించుకోవాలని, గతంలో లాగానే నేరుగా పింఛనుదారులకు అందించాలని కోరారు. సచివాలయాలు దూరంగా ఉన్నచోట దగ్గరలో ఉండే పంచాయతీ కార్యాలయాలు, సిబ్బందిని కూడా దీనికి ఉపయోగించుకోవాలని అన్నారు. దీన్ని రాజకీయం చేస్తూ పింఛన్లుదారులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు.

వైసిపి రాజకీయం చేస్తోంది: అమరనాథ్ రెడ్డి



పలమనేరు: ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం పెన్షన్లకు సంబంధించి రాజకీయాలు చేస్తోందని, ఎన్నికలకు పెన్షన్లు ఇచ్చేందుకు సంబంధం లేదని, ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి డ్రామాలకు ఆస్కార్ అవార్డును ఇవ్వొచ్చుఅని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పింఛన్లు పంపిణీకి సంబందించి వైసిపి నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై ఆయన స్పందిస్తూ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోసపూరిత విధానాల వల్లనే నేడు పెన్షన్ అందడం లేదని దీనికి అనవసరంగా తెలుగుదేశం పార్టీపై నెపం వేయడం సరికాదని, పేదలకు, వృద్ధులకు వెంటనే పెన్షన్ లను అందివ్వాలనీ, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని తెలియజేశారు. ఎన్నికల సమయంలో అధికారులను పెట్టుకొని లబ్ధిదారులకు పెన్షన్లను అందించి సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్‌వి.బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, మదన్ శ్రీధర్, అస్లాం, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించండి: ఆర్‌డిఓ

ప్రజాశక్తి- పూతలపట్టు: పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో నేటికీ వివిధ పార్టీల ఫ్లెక్సీలు ఉన్నట్టు సమాచారం ఉందని, పంచాయతీ కార్యదర్శులు కోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఫ్లెక్సీలను తొలగించాలని ఎన్నికల అధికారి ఆర్డిఓ చెన్నయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పర్యటించి ఫ్లెక్సీలను తొలగించాలని, ఫ్లెక్సీలున్నట్టు తమ దృష్టికి వస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



మహాభారత ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ 49కొత్తపల్లి మిట్టలో వెలసిన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల వారి దేవస్థానంలో మహాభారత యజ్ఞ మహోత్సవం ప్రారంభమైంది. సోమవారం నుంచి 18వ తేదీ వరకు 18 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ పెద్ద నాగరాజులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలతో వైభవంగా ప్రారంభించారు. మధ్యాహ్నం రమేష్, వెంకటేశులు, సుధాకర్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బార్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టు బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా ఎం.జె. జగదీషన్, ఉపాధ్యక్షులుగా ఈజీ బాబు, కార్యదర్శిగా రావూరి పురుషోత్తం, ఉపకార్యదర్శిగా అరుణ్, కోశాధికారిగా నాగరాజన్ ఎన్నికయ్యారు. జడ్జి విష్ణువర్మ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ ప్రశాంత వాతావరణంలో కోర్టు నడవడానికి నూతన కార్యవర్గం సహకరించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు మురళీధర్, ఉదయభాను, మహాదేవన్, చిరంజీవులు, మణివాసగం, బాబు, జాన్జోష్, త్యాగరాజన్, మురళీకృష్ణ, తిరుమలయ్య, ధరణి తదితరులు పాల్గొన్నారు.

రామాంజులు నాయుడికి నివాళి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగలపల్లికి చెందిన మాజీ వీఎం రామాంజులు నాయుడు ఆదివారం మృతి చెందారు. సోమవారం ఆయన భౌతికకాయానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథ్ రెడ్డి, మోహన్ మురళి, బాబు నాయుడు, రజనీకాంత్, వరప్రసాద్, వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



ప్రజాశక్తి - సోమల: మండలంలోని కందూరు గ్రామంలో సోమవారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో గంగజాతరను ప్రజలు జరుపుకున్నారు. ఆదివారం రాత్రి అమ్మ వారి మట్టి విగ్రహాన్ని గ్రామ చావిడి వద్ద మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి కొలువు తీర్చారు. సోమవారం ఉదయం అమ్మవారికి మహిళలు పొంగళ్లను నైవేద్యం పెట్టగా, గ్రామ ఆచారం ప్రకారం దున్నపోతును అమ్మవారి ఎదురుగా బలి ఇచ్చారు. అనంతరం కందూరు పరిసర ప్రాంత ప్రజలు సోమల, సదుం, నిమ్మనపల్లి, కలికిరి ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 9 గంటలకు అమ్మవారి మట్టి విగ్రహాన్ని ఆసాదు పాటలతో కొలిచి ప్రత్యేక వాహనంలో అమ్మవారిని గ్రామంలో ఊరేగించి గ్రామ పొలిమేర్లలోని చెరువులో నిమజ్జనం చేశారు. గంగ జాతర కోసం గ్రామం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించగా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేశమ్మ ఆలయంలో మంత్రి పూజలు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి మండలంలోని టీఆర్ కండ్రిగలోని నేత్రప్రదాయణి దేశమ్మ దేవత ఆలయంలో మంత్రి రోజా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వేణుబాబు, నాయకులు వెంకటేశ్, శశికుమార్, దయానిధి, ఇంద్రారెడ్డి, సుదర్శనం నాయుడు, తిరుమలరెడ్డి, ఎల్లప్పరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

'యువతకు తీవ్ర అన్యాయం'

ప్రజాశక్తి-రామకుప్పం: గడచిన ఐదు ఏళ్లలో రాష్ట్రంలోని యువతకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండల తెలుగు యువత అధ్యక్ష, కార్యదర్శి విశ్వనాథ్, వెంకటాచలం పేర్కొన్నారు. సోమవారం రామకుప్పంలో తెలుగు యువత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కరువై భవిష్యత్తు ప్రశ్నార్థకరంగా మారిందన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే మరల టిడిపి అధికారంలోకి రావాలన్నారు. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడమే టిడిపి ప్రధాన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, మంజునాథ్, సతీష్, మంజునాథ్ రెడ్డి, అవినాష్, సాగర్, చలపతి, ఆదిల్, కిరణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవుల పల్లె గ్రామంలోని మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సరస్వతీ పూజ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఓం ఆకారాన్ని అందంగా క్లాస్ రూమ్‌లో నేలపై చిత్రీకరణ పలువురిని ఆకట్టుకుంది. అనంతరం సరస్వతి పూజను నిర్వహించి విద్యార్థులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆపై విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం విలువైన పలుకులను మాటల రూపంలో అందజేశారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు చేపట్టగా గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం వీక్షించి విద్యార్థులను అభినందించారు. కాగా పలువురు విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

నా కుమార్తెను ఆశీర్వదించండి: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: వైసీపీ తరపున జీడీ నెల్లూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన కుమార్తెను ఆశీర్వదించి గెలిపించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. సోమవారం ఎస్ఆర్ పురం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మీతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, సర్పంచులు హరిత, దిలీప్ రెడ్డి, ఐశ్వర్య, ఎంపీటీసీ శివయ్య, సిద్దయ్య, మునిరాజు నాయుడు, మణి, రమణ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

టీడీపీ నాయకులపై దాడులు దారుణం: సీఆర్ రాజన్



ప్రజాశక్తి-కుప్పం: టీడీపీ నాయకులపై దాడులు చేయడం దారుణమని టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్ అన్నారు. సోమవారం ఆయన కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీ నామాలప్పపై వైసీపీ నేతలు దాడి చేసినట్టు ఆరోపించారు. గంజాయి మత్తులోనే వైసిపికి చెందిన వ్యక్తులు తమ పార్టీ నాయకులపై దాడి చేశారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో అలజడి సృష్టించి గెలవడానికి వైసిపి ప్రయత్నం చేస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి దాడులకు ప్రతి దాడులు చేయడం టిడిపి నాయకులకు సైతం చేతలవుతుందని, కానీ తమ అధినాయకుడు నేర్పిన క్రమశిక్షణ తమకు అడ్డుగా నిలుస్తుందని తెలిపారు. ఎవరు ఎన్ని చేసినా కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందడాన్ని అడ్డుకునే దానికి సాధ్యం కాదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త పిఎస్ మునిరత్నం, టిడిపి నాయకులు జిఎం రాజు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో గెలుస్తాం..: ఎంపీ



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలోని అన్ని స్థానాల్లో వైసీపీ జెండా ఎగురవేస్తామని, తమ పార్టీ అభ్యర్థులే గెలవబోతున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప జోస్యం చెప్పారు. సోమవారం ఆయన వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరవేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ నెల 3, 4వ తేదీల్లో సీఎం జగన్ జిల్లాలో పర్యటిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. పూతలపట్టు సమీపంలోని బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారి వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో వైసీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం



దగ్ధమైన పూరిగుడిసె

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట పంచాయతీ ఫిరంగుల గుట్ట గ్రామానికి చెందిన నరసయ్య అనే వ్యక్తికి చెందిన పూరిగుడిసె సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.30వేల ఆస్తి నష్టం కలిగినట్టు సర్పంచ్ వెంకటరెడ్డి తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా విద్యుత్ వైరు కరిగి షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదం సంభవించిందని ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు నీళ్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా మంటలు అదుపులోకి రాలేదని పూరి గుడిసె పూర్తిగా దగ్ధం అయినట్లు అక్కడి వారు తెలిపారు. గుడిసెలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయని నరసయ్య తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్ ఆత్మహత్య

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ప్రేమించిన అమ్మాయి తనకు ఎక్కడ దక్కదో అని మానసిక ఒత్తిడికిలోనై వెటర్నరీ అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. ఎస్ఆర్ పురం ఎస్ఐ రాజ కుళ్లాయప్ప కథనం మేరకు.. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం అనుపల్లి పంచాయతీ ఉప్పుల వంక గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ (27) ఎస్ఆర్ పురం మండలంలోని ఏఎం పురం వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇతను ప్రేమలో పడి ప్రేమించిన అమ్మాయి తనకు ఎక్కడ దక్కదో అని మానసిక ఒత్తిడికి లోనై సోమవారం ఎస్ఆర్ పురంలో తాను ఉంటున్న అద్దె ఇంట్లో ఇనుప రాడ్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతి మిస్సింగ్

- కేసు నమోదు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లికి చెందిన రామప్ప కుమార్తె నిర్మల(17) అదృశ్యమైంది. శనివారం నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- పశువులు, లేగదూడలపై దాడి
- బెంబేలెత్తిపోతున్న స్థానికులు



కుక్క కాట్లుకు గాయపడిన లేగదూడను పరిశీలిస్తున్న రైతు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: పశువులు, దూడలనే టార్గెట్‌గా ఓ పిచ్చికుక్క దాడులకు పాల్పడుతోంది. మండలం లోని మాంబేడులో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తోంది. ఆదివారం రాత్రి పశువులు, లేగదూడలపై దాడి చేసింది. రైతులకు సంబంధించి 18 పశువులు, లేగదూడలను తీవ్రంగా గాయపరిచింది. దీంతో రైతులు, స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. చిన్నారులు బెంబేలెత్తిపోతున్నారు. సంబంధిత అధికారులు వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిచ్చికుక్క బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. గాయపడిన పశువులకు చికిత్స అందించాలని, పిచ్చికుక్కను బంధించే చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

భార్యాపిల్లలను వదిలేసి ప్రేయసితో జంప్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: భార్యాపిల్లలను విడిచిపెట్టిన భర్త ఓ మైనర్ యువతితో కలిసి పారారైయ్యాడు. యువతి తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. బైరెడ్డిపల్లి మండలం తావడకుప్పంకి చెందిన ఈశ్వర్‌కి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతితో ఈశ్వర్ ప్రేమలో పడ్డాడు. 16 రోజుల ముందు భార్యాపిల్లలను విడిచిపెట్టి యువతిని వెంట బెట్టుకొని పరారైయ్యాడు. దీంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. తీవ్రంగా గాలించిన పోలీసులు ఆదివారం ఈశ్వర్‌ను, యువతిని చిత్తూరులో అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఈశ్వర్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఇసుకాసురుల బరి తెగింపు!

- అడ్డుకుంటే దాడి
- అధికారుల నిర్లక్ష్యంతో యథేచ్ఛగా సాగుతున్న రవాణా

ప్రజాశక్తి - పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలం పులి కుండ్రం నదీ పరివాహక ప్రాంతంలో ఇసుకాసులు బరితెగించి యథేచ్ఛగా రవాణాకు పాల్పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడికి పాల్పడుతున్నారు. పట్టించుకోవాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుండడంతో ఇసుకాసుల ఆగడాలకు అడ్డు, అదుపూ లేకుండా పోతోంది.

యథేచ్ఛగా ఇసుక రవాణా

కొంతమంది బడా నాయకుల కను సైగల్లో రెవెన్యూ శాఖల నిర్లక్ష్యంతో రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను తరలించి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నా వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదని పులిగుండ్రం గ్రామ ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు పరిస్థితిని వివరించినా ఇదే పరిస్థితి కొనసాగుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గతంలో స్వాధీనం చేసుకున్న ట్రాక్టరు (ఫైల్ ఫోటో)

...ంగా ఇసుకను తరలిస్తుండగా ప్రశ్నించిన పులి కుండ్రం రైతులపై అధికార పార్టీకి చెందిన నాయకులు దాడులకు పాల్పడ్డారని ఆ గ్రామస్తులు వాపోయారు. కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తూ లక్షలు సంపాదించుకుంటున్నారని గ్రామంలో విమర్శలు జోరుగా సాగుతున్నాయి. ఒక ప్రభుత్వ వచ్చినందుకే రెచ్చిపోతున్న అధికార పార్టీ నాయకులు మళ్లీ అధికారంలోకి వస్తే ఎలా రెచ్చి పోతారోనని పులి గుండ్రం గ్రామ ప్రజలు, రైతులు భయాందోళనకు గుర వుతున్నారు. పోలీసులు గతంలోనూ ఇసుక ట్రాక్టర్‌తో పోలీస్ స్టేషన్ వరకు తీసుకువచ్చి పంచా యితీ చేసుకొని ఇసుక ట్రాక్టర్‌ను పంపివేశారని స్థానికులు తెలిపారు. ఆ రోజే ఆ అధికార పార్టీ నాయకులను పోలీసులు శిక్ష విధించి వుంటే నేడు ఇలాంటి దారుణాలు జరిగేవి కావని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. రైతుపై దాడికి పడిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పులిగుండ్రం గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్ఐ



అధికార పార్టీకి చెందిన వెంకటేష్‌పై కేసులు పెట్టాం. వారికి ఫైన్ వేసి చలానా కట్టి వెళ్లారు. మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నాం. ఇకపై ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు.

- వెంకటేశ్వర్లు, పిచ్చాటూరు ఎస్ఐ

నూతన ఆవిష్కరణలతో కంపెనీల సుస్థిరత

- మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ కే ప్రకాష్ సాయి



మాట్లాడుతున్న మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ కే ప్రకాష్ సాయి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): నూతన ఆవిష్కర ణలతో కంపెనీలు సుస్థిరతను సాధించవచ్చునని మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ కే ప్రకాష్ సాయి అన్నారు. చంద్రగిరి మండలం ఏ రంగంపేట సమీపంలోని సాయినాథ నగర్ లో వెలసిన మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఒకటవ అంతర్జాతీయ 3 రోజుల సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సదస్సులో నావిగేషన్ ద ఫ్యూచర్ ట్రెండ్స్, స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్ సాయి మాట్లాడుతూ 'కంపెనీల జీవితం, మనుగడ స్థిరమైన దృక్పథం' అనే అంశాలను చక్కగా వివరించారు. కంపెనీలు పర్యావరణం, సామాజిక బాధ్యతలతో స్థిరత్వం, లాభదాయకాలను సమతుల్యం చేసుకోవాలని సూచించారు. విజయాలను ఆవిష్కరించడంలో ఖర్చులను నియంత్రణ చేయడంలో కంపెనీలు స్థిరత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు డిమాండ్ ను బట్టి ఉత్పత్తిని చేసుకోవాలని సూచించారు. గౌరవ అతిథి తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ టీచర్స్ సంస్థ ప్రొఫెసర్ భాను శ్రీ రెడ్డి మాట్లాడుతూ సస్టైనబుల్ ఎంటర్‌పెన్యూమార్ షిప్ ఫర్ పీపుల్ ప్లేస్, లాభదాయకతపై తన అనుభవాన్ని పంచుకున్నారు. దీర్ఘకాలిక విజయ సాధన కోసం నిర్దిష్ట అభ్యసనాలను కార్పొరేట్ పాలనను అనుసరించాలన్నారు. మరో అతిథి ఎంబియు రిజిస్టర్ డాక్టర్ సారథి యువ వ్యాపార నాయకులు, వ్యవస్థాపకులు నవీన ఆవిష్కరణలపై సుస్థిరత సాధించాలన్నారు. ఎంబీయూ స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం సురేష్ బాబు అతిథులకు స్వాగతం పలికారు. ఈ అంతర్జాతీయ సదస్సు నూతన ఆలోచనల మార్పిడికి, తెలివైన ఉపన్యాసాలకు, వినూత్న అన్వేషణలకు వేదిక కానుందన్నారు. అతిథులను సన్మానించి, మెమెంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ బి వెంకటేష్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ కులదీప్ కుమార్, జాయింట్ కన్వీనర్ డాక్టర్ డిక్రుపావతి, విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా కుటుంబాన్ని అణగదొక్కేందుకు యత్నించారు

- అన్నా రామకృష్ణ యాదవ్



మాట్లాడుతున్న అన్నా రామకృష్ణ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో రాజకీయం గా బలమైన కుటుంబంగా గుర్తింపు పొందిన అన్నా కుటుంబాన్ని ఎలాగైనా అణచివేయాలన్నా కుట్రతో తెరచాటు రాజకీయాలు చేయడంతో ఆత్మాభి మానాన్ని చంపుకోలేక వైసీపీకి రాజీనామా చేస్తున్నానని అన్నా రామకృష్ణ యాదవ్ తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ వద్దకు తన అనుచరులు వందలాది మంది చేరుకొని నినాదాలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థలో రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ విలీనం కాక ముందు నుండి జీవకోన ప్రజలతో మమేకమై జీవించామని, అక్కడి ప్రజలతో తమ అన్న కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని, ప్రజలతో సమీక్షించిన తర్వాతే వైసిపికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. తాము అడగకపోయినా మేయర్ పదవి ఇస్తానని ఆశ చూపించిన వ్యక్తి నేడు తమ కుటుంబ ప్రాబల్యం తగ్గించే విధంగా నీచ రాజకీయాలు చేస్తున్నారని తమ సామాజిక వర్గంతోనే తమను తిట్టిస్తూ, ఐక్యంగా ఉన్న తమను వేరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నా రామచంద్రయ్య మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా తమ కుటుంబంపై అణిచివేత ధోరణిని గమనించామని, ఇందుకు నిరసనగా రాజీనామాలు చేశామ న్నారు. ఎమ్మెల్యే భూమన కరుణా కర్ రెడ్డి మాటలకు, ఆయన ప్రవర్త న శైలికి తీవ్ర వ్యత్యాసం ఉందని, తిరుపతిలో మాదకద్రవ్యాల వినియో గాన్ని అడ్డుకున్నది.. నేడు అమ్మకాలకు ప్రోత్సహిస్తోంది వారు కాదా? అని ప్రశ్నించారు. పదవుల కోసం దిగజారి పోయే వ్యక్తిత్వం తమకు లేదని, కార్పొరేటర్ పదవులకు కూడా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే జీవకోనలో పదవి గెలుచుకోవాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే తమ కుటుంబం పై చూపుతున్న అణిచివేత ధోరణికి నిరసనగా నేడు దాదాపు 300 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచి అన్నా మల్లీశ్వరి, మాజీ ఎంపీటీసీలు శేఖర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, బాలిరెడ్డి, చిరంజీవి, బుజ్జమ్మ, మునస్వామి యాదవ్, ఆదికేశవులు, అన్నా నారాయణ పాల్గొన్నారు.

మధుపై అవినీతి నిరూపణకు సిద్ధం: బొజ్జల



మీడియాతో మాట్లాడుతున్న బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేసిన అవినీతిని నిరూపించడానికి తాము సిద్ధమని టిడిపి కూటమి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనతో పాటు చంద్రబాబునాయుడు, లోకేష్ బాబు పై మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజకీయ జీవితం ముగుస్తుందనే ఆందోళనలో మధు ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబునాయుడును విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో అటవీశాఖ అనుమతులు ఎందుకు తీసుకు రాలేదని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ప్రశ్నించారు. ఇక శ్రీకాళహస్తిలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు జిల్లాల పునర్వవస్థీకరణలో భాగంగానే శ్రీకాళహస్తికి వచ్చిందనీ, ఆయన ఘనత కాదన్నారు. చిల్లర రాజకీయాలు చేయవద్దని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హితవు పలికారు. ఇక రాజీవ్ నగర్ లో అక్రమాలు నిరూపించడానికి తాను సిద్ధమేనని సుధీర్ రెడ్డి సవాల్ విసి రారు. మాడ వీధుల్లో భూగర్భ విద్యుత్, లైటింగ్ పేరుతో బియ్యపు మధు రూ.కోట్లు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రమాణం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. బియ్యపు మధు చేసిన అక్రమాలు నిరూపిం చడానికి తాను సిద్ధమన్నారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ



ఉత్తమ ప్రతిభ చూపి సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 2వ తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ను చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పుత్తూరులోని గణేష్ తైక్వాండో అకాడమీలో సోమవారం నిర్వహించారు. ఈ టెస్ట్‌ను చిత్తూరు డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ తైక్వాండో అకాడమీ సహకారంతో నిర్వహించగా, ఈ టెస్ట్ లో పుత్తూరు చెందిన 15 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను సీడీటీఏ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దిపట్ల చంద్రశేఖర్ ఆదేశాలమేరకు అధ్యక్షులు టి ధనంజ యులు ఆధ్వర్యంలో పుత్తూరులో తైక్వాండో అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ తైక్వాండో అభివృద్ధికి పాటుపడుతున్న వి గణపతి దాస్ అలియాస్ (గణేష్) సహకారంతో టెక్నికల్ ఆఫీసియల్స్ బి శ్రీనివాసులు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులు అందరూ అన్ని విభాగాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ఉత్తీర్ణులు కావడానికి కోచ్‌లు డి లోకేష్ , గౌతమ్, డి షణ్ముఖ పృథ్వి ఎంతగానో సహ కరించారు. విచ్చేసిన ప్రముఖు లు మాట్లాడుతూ నేటి సమా జం లో అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి ఇలాంటి ఆత్మ రక్షణ విద్యలలో తప్పని సరిగా శిక్షణ పొందాలన్నారు. శిక్షణ పొందిన వారు తమను తాము రక్షించు కోవచ్చని తెలిపారు. విద్య ,ఉపాధి అవకాశాలు మెండుగా పొంద వచ్చు నన్నారు.

కుంభకోణంపై చర్యలు తీసుకోవాలి: రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో అక్రమాలకు పాల్పడి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకొని, కేసు నమోదు చేయాలని తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, తిరుపతి పార్లమెంటు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో సోమవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు గాలి పవన్ చౌదరి, లోకేష్, ప్రసన్న, టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సాయికుమార్ గౌడ్, కోబాక లక్ష్మణ్ పాల్గొన్నారు.

పలువురికి హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలు, వికలాంగులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, డిఎస్పి ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలో పనిచేస్తున్న ముస్లిం మహిళలకు రంజాన్ కానుకగా పట్టుచీరలు, పండుగ సరుకులు అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 147 నెలలుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆర్డిఓ, డిఎస్పి కొనియాడారు. ఆ సంస్థ నిర్వాహకుడు మునీర్ బాషాను ఈ సందర్భంగా అభినందించారు.

బీమా చెల్లింపులో నిర్లక్ష్యం తగదు: కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కుటుంబానికి దూరమయిన వ్యక్తి కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న కారణంతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా మొత్తాన్ని చెల్లించడానికి అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని సత్యవేడు ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం అన్నారు. వ్యక్తి మృతి చెందితే దహన క్రియలకు తక్షణం రూ 10 వేలు చెల్లించాల్సి ఉంటే, రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను కారణం చూపి బాధిత కుటుంబాలకు నేటికీ తక్షణ సాయాన్ని అధికారులు అందివ్వలేదన్నారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగ బాలయ్య (బీసీ), కేవీబీ పురం మండలం పెరిందేశం వెంకటేశం (ఎస్సీ), పిచ్చాటూరు మండలం నీరువాయి షణ్ముగం (ఎస్సీ)లు పేదవారేనని, 50 సంవత్సరాల లోపు వారే అని వ్యక్తి మృతితో మానసికంగా, ఆర్థికంగా ఆ కుటుంబం ఎంత కష్టపడుతుందో అధికారులు అర్థం చేసుకోవడం లేదన్నారు. నారాయణవనం, కేవీబీ పురం, పిచ్చాటూరు ఎంపీడీవోలను, సంబంధిత పంచాయతీ కార్యదర్శులను నేరుగా ఫోన్‌లో సంప్రదించి, వెంటనే ఆర్థిక సాయం అందివ్వాలని సూచించినా ఎన్నికల కోడ్‌తో నగదు చెల్లించలేమన్న వారి సమాధానం చాలా బాధాకరమన్నారు.